క్లుప్తంగా

యోగాపై సమీక్ష


మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్

పూసపాటిరేగ : విశాఖలో ఈ నెల 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రమేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో బుధవారం యోగాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రాధిక, ఏపీవో తిరుపతిరావు, ఏపీఎం అచ్యుతరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ జయచంద్రనాయుడుకు అభినందనలు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ ఎం.జయచంద్రనాయుడుకు వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం ఆయన నివాసంలో అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో గొట్టాపు చిన్నంనాయుడు, రామకృష్ణ, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

పుస్తకావిష్కరణ

విజయనగరం టౌన్: మానవసేవే మాధవసేవని నమ్మిన మెగాస్టార్ చిరంజీవి సినీ, రాజకీయ, సేవా రంగాల్లో చేసిన సేవలు ఎనలేనివని అఖిల భారత చిరంజీవి యువత నాయకులు గురాన అయ్యలు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దనున్న జీఎస్ఆర్ గ్రాండ్‌లో చిరంజీవి జన్మదిన వారోత్సవాల పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సినిమాకు చిరంజీవి గొప్ప స్ఫూర్తి అని, దూరదృష్టి కలిగిన వ్యక్తిని కొనియాడారు. ఆగస్టు 15 నుంచి 22 వరకూ వారం రోజుల పాటూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా అధ్యక్షుడు రాంకీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మెగా అభిమానులు చక్రవర్తి, రంగనాయకులు, హుస్సేన్, చంద్రనాయుడు, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నతంగా ఎదగాలి

డెంకాడ: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకంత నాగమాధవి అన్నారు. మండలంలోని డెంకాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్‌లను విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. వివిధ రకాల సమస్యలతో విద్యకు విద్యార్థులు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వాలు విద్యార్థులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నాయని వివరించారు. కిట్‌ల ద్వారా పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, విద్యకు అవసరమయ్యే పలు రకాల వస్తువులు ఉన్నాయన్నారు. తమ పిల్లలు బాగా చదువుకుని ఉన్నతంగా ఉండాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు ఎన్నో ఇబ్బందులు పడి చదివిస్తున్న విషయం విద్యార్థులు మరువరాదన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.హిమగాయత్రి, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, సర్పంచ్ లెంక లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ పల్లె భాస్కరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పాణిరాజు, ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు, ఎంపీడీవో భవాని తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన


రైల్వేస్టేషన్‌లో పనులు పర్యవేక్షిస్తున్న అధికారుల బృందం

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను రైల్వే అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. అమృత్ భారత్ పథకం నిధులతో స్థానిక రైల్వేస్టేషన్‌లో కొంత కాలంగా పనులు చేపడుతున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, డీఎస్‌టీఈ విజయ్ సైనీ, డీఈఈ అశోక్‌కుమార్, ఏఈఎన్ గౌరీనాయుడు, తదితరులు పనులు పరిశీలించి కాంట్రాక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్ ఇప్పిలి నీలకంఠం పాల్గొన్నారు.

గో హంతకులను శిక్షించాలి

గుర్ల: మండలంలోని గూడెం గ్రామ శివారులోని టేకు తోటలో గోవులను నిర్బంధిస్తున్న నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర గో సంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ, బీజేపీ మహిళా నేత పాక నాగమల్లిక రాణి డిమాండ్ చేశారు. గూడెం, గుజ్జంగివలసలో నిర్బంధంలో ఉన్న గోవులను వారు బుధవారం పరిశీలించారు. గోవులకు మేత వేసి, పరిస్థితిని పోలీసులకు వివరించారు.

ఆదాయార్జనే లక్ష్యం

- నగరంలో ఆస్తి పన్ను మదింపుపై రీ సర్వే
- ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభమైన సర్వే


నగరంలోని భవన సముదాయాలు


రీ సర్వేలో భాగంగా భవనం కొలతలు తీస్తున్న కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: ఆదాయమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం మరో కార్యక్రమానికి తెరలేపింది. నగరాలు, పట్టణాల్లో ఆస్తి పన్ను నిర్ణయంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ మరోసారి క్షేత్రస్థాయి సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టారు. పన్ను మదింపునకు సంబంధించి కొలతలు తీసి తేడాలుంటే సిబ్బంది సరి చేయనున్నారు. కచ్చితంగా ఉన్నవాటి జోలికి వెళ్లరని, గతంలో అనుమతులు తీసుకుని అదనంగా నిర్మాణాలు చేపడితే వాటిని పన్ను పరిధిలోకి తీసుకురానున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు సచివాలయాల్లోని రెవెన్యూ సిబ్బందికి మున్సిపల్ శాఖ ఇప్పటికే శిక్షణ పూర్తి చేయగా... విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రీ సర్వే ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా స్థానిక సంస్థల మనుగడకు ఎటువంటి నిధులు విడుదల చేయకున్నా వివిధ పన్నులు రూపంలో ప్రజల ముక్కు పిండి ఆదాయాన్ని సమకూర్చుకుంటుంది. గడిచిన ఏడాది కాలంలో ఒక్క అభివృద్ధి పని చేపట్టక పోగా... తాజాగా ఆస్తి పన్నుల ఆదాయాన్ని పెంచుకునేందుకు భవనాల రీసర్వే కార్యక్రమాన్ని చేపడుతోంది. కొత్తగా నిర్మించిన భవనాలకు పన్ను విధించకపోవడం, వాణిజ్య భవనాలను నివాస కట్టడాలుగా చూపించి కొంతమంది రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారన్నది ప్రభుత్వ భావన. ఈ రకంగా కార్పొరేషన్ ఖాజానాకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అందుకే క్షేత్ర స్థాయి సర్వే ద్వారా లోటుపాట్లను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా చూడాలని అధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. సర్వే వచ్చే నెల 15లోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి ఇళ్లు, వాణిజ్య భవనాలను కొలతలు తీసి రికార్డు చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం కొలతలు లేని చోట లోటుపాట్లను సవరిస్తున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 61 సచివాలయాలు ఉండగా.. వాటి పరిధిలో 70వేలకు పైగా అసెస్‌మెంట్‌లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం పాత, కొత్త బకాయిలు కలిపి రూ.40 కోట్లకు పైగా ఆదాయం రావాల్సి ఉంది. ఈ సర్వే ద్వారా రూ.10 నుంచి రూ.15 కోట్ల మేర ఆస్తి పన్ను పెరుగుతుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఆదాయం పెరిగితే నగరంలో అభివృద్ధి పనులకు నిధుల లభ్యత పెరుగుతుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. క్షేత్ర స్థాయి సర్వే వివరాలు రికార్డుల్లో నమోదు చేస్తున్నామని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు తెలిపారు. తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు చర్యలు చేపడతామన్నారు.

నగరంలో ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు


ఇంకుడు గుంతల నిర్మాణానికి డ్రిల్లింగ్

విజయనగరం: ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టే విధంగా నూతన ప్రక్రియకు శ్రీకారం చుట్టామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. నగరంలో 10 ప్రాంతాలలో ప్రయోగాత్మకమైన ఇంకుడు గుంతల ఏర్పాటుకు పనులు ప్రారంభమయ్యాయి. విజయనగరం నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు గుర్తించిన ప్రాంతాల్లో గుంతలను వేసే కార్యక్రమాలను చేపట్టారు. ఇటీవల నగరానికి చేరుకున్న ఇస్రో శాస్త్రవేత్త ఇంకుడు గుంతలపై సర్వే చేపట్టి అందుకు తగ్గ ప్రాంతాలను గుర్తించారు. 100 అడుగుల లోతున ఇంకుడు గుంతలను నిర్మించే ప్రక్రియను ప్రారంభించారు. గుంత చుట్టూ 6/6 మీటర్ల వైశాల్యం కలిగిన ఏటవాలు నిర్మాణాలు చేపడుతున్నారు. తద్వారా నీటి సంరక్షణకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వర్షపు నీరు, వృథా నీటిని ఒడిసి పట్టే క్రమంలో ప్రయోగాత్మకమైన ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఒక్కొక్క గుంతను రూ.4.97 లక్షలతో చేపడుతున్నామన్నారు. 33 మీటర్ల పొడవున ఇంకుడు గుంతలో వర్షపు నీరు, చెరువుల నుంచి వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టేందుకు ఈ నూతన ప్రక్రియ దోహదపడగలదన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

వరి విత్తనాల పంపిణీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఎమ్మెల్యే లోకం నాగమాధవి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పంటలకు మంచి పునాది వేయాలంటే నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడం చాలా కీలకమన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. రాయితీపై విత్తనాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. సర్పంచ్ రాంబార్కి రామలక్ష్మి, ఏవో శ్రీలక్ష్మి, నాయకులు చనమల్లు రమణ, అంబళ్ల అప్పలనాయుడు, యడ్ల గోవింద పాల్గొన్నారు.

టీడీపీ నేతలు భయపెడుతున్నారు...


వైఎస్సార్‌సీపీ నేత కంది శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: టీడీపీ నేతలు తనను భయభ్రాంతులకు గురి చేస్తూ వేధిస్తున్నారని మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కంది శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ ప్రతినిధిగా ఉన్న ఓ టీడీపీ నేత మాట్లాడిన ఆడియో క్లిప్పులు బయటకి వచ్చాయన్నారు. తనపై నలుగురు టీడీపీ నేతలు టార్గెట్ పెట్టారంటూ స్వయంగా ఆయనే ఆడియోలో చెప్పారన్నారు. నాపై ఎన్ని కుట్రలు పన్నినా భయపడనని స్పష్టం చేశారు. సామాన్యుడిపై అంత అక్కసు దేనికని ప్రశ్నించారు. టీడీపీ నేతల నుంచి తనకు ప్రాణహాని ఉందని, సదరు ఆడియో క్లిప్పులను పోలీసుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే


సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని టిడ్కో కాలనీలో నూతనంగా నిర్మించిన 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు త్వరలోనే ప్లాట్లు కేటాయిస్తామని చెప్పారు. పట్టణం నుంచి కాలనీ వరకు ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డును బీటీ రహదారిగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే కాలనీలో సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, వీధిలైట్లు తదితర సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ తారక్‌నాథ్, విద్యుత్ శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, ఈఈ త్రినాథరావు, ఏఈ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న దాతలు

గంట్యాడ: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్లడ్‌బ్యాంక్‌ల్లో రక్త నిల్వలు తక్కువగా ఉన్నందున.. గ్రామీణ ప్రాంతాల్లో రక్తదానంపై అవగాహన కల్పించడం కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ హరికిరణ్, సీఎస్‌డీటీ మూర్తి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అందజేత


నగదును మహిళకు అందజేస్తున్న పోలీసులు

గజపతినగరం రూరల్: ఆటోలో బ్యాంక్‌కు వెళ్తూ రూ.30 వేల నగదు పోగొట్టుకున్న మహిళకు 12 గంటలు గడవక ముందే గజపతినగరం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పోగొట్టుకున్న నగదును మహిళలకు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయానికి ఎదురుగా ఉండే కాలనీలో నివాసం ఉండే పార్వతి బ్యాంక్‌లో రూ.30 వేల నగదు డిపాజిట్ చేసేందుకు మంగళవారం సాయంత్రం ఆటోలో బయలుదేరింది. బ్యాంక్ వద్దకు వచ్చేసరికి నగదుతో కూడిన పర్సును ఆటోలో మర్చిపోయి.. బ్యాంక్‌కు వెళ్లి చూడగా నదదు కనిపించకపోవడంతో తక్షణమే పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆమె నుంచి వివరాలు సేకరించి 12 గంటలు గడవక ముందే పోగొట్టుకున్న నగదును ఆమెకు అప్పగించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు రక్త పరీక్షలను నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కొత్తవలస: మండలంలోని వియ్యంపేట గ్రామ సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వియ్యంపేట పీహెచ్‌సీ అధికారులు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు ఎల్.సత్యారావు మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డైయేరియా, చికెన్‌గునియా, పచ్చకామెర్లపై అప్రమత్తంగా ఉంటూ.. సకాలంలో వైద్యసేవలు పొందాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అరుకు, పాడేరు, దేవరాపల్లి, సాలూరు, మక్కువ, పార్వతీపురం నుంచి వచ్చిన విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ, ఆరోగ్య సిబ్బంది ఈశ్వరరావు, సత్యారావు, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళకు ఇంటి పట్టా మంజూరు చేయాలి


మాట్లాడుతున్న మాదిగ సంఘం నాయకులు సుధాకర్, తదితరులు

విజయనగరం టౌన్: దళిత మహిళను మానసికంగా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకుని ఆ మహిళకు ఇంటి పట్టా మంజూరు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ పెంకి సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక తోటపాలెంలో ఉన్న కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంట్యాడ మండలం వసంత గ్రామానికి చెందిన మంటిపల్లి పైడమ్మ భర్త చిన సింహాద్రికి 1991-92లో 42/91 ఏలో నాటి కలెక్టర్ రాధా మూడు సెంట్ల భూమిని మంజూరు చేశారన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గుల్లిపల్లి పోలినాయుడు, కసిరెడ్డి రామారావు అనే గ్రామపెద్దలు దళిత మహిళ అయినటువంటి పైడమ్మను మానసికంగా వేధిస్తూ బాధితుల రెండు సెంట్ల భూమిని బల్లంకి రమణచే ఆక్రమింపజేసి పునాదులు వేసి దౌర్జన్యం చేసి ఇంట్లో ఉండనీయకుండా వేధిస్తున్నారన్నారు. గంట్యాడ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తే కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ చూపించినా పట్టా లేనందున రమణకే చెల్లుతుందని ఏకపక్షంగా తెలుగుదేశం సర్పంచ్ చెప్పినట్టు ఎస్ఐ నడుచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆమెకు మూడు సెంట్ల పట్టా మంజూరు చేయాలని అధికారులను కోరారు. కొత్తవలస నియోజకవర్గ ఇంచార్జ్ ఇండిగిబిల్లి పెంటయ్య, మాదిక రాష్ట్ర నాయకులు వైఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు అమానుషం


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలో దళితులు, మహిళల మీద దాడులు జరుగుతున్నాయని జైభీమ్ రావు భారత్ పార్టీ విజయనగరం పార్లమెంట్ ఇంచార్జ్ చిన్నం అరుణ్‌కుమార్ ఆరోపించారు. స్థానిక ఆర్‌డీవో కార్యాలయ ఆవరణంలో ఆయన విలేకర్లతో బుధవారం మాట్లాడారు. దళితులపై దాడులకు తెనాలి సంఘటనే నిదర్శనమన్నారు. కొన్ని ప్రాంతాల్లో దళితులు భూములు లొక్కొంటున్నారని, మరి కొన్ని ప్రాంతాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అనంతపురంలో జరిగిన సంఘటన ఇంకా కుల వివక్ష పోలేదు అనడానికి నిదర్శనమన్నారు. ఆయనతో రాష్ట్ర నాయకులు మరడానా వెంకటనాయుడు, రాజాం ఇంచార్జ్ పొడుగు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పాత బకాయిలు చెల్లించి సీట్లను భర్తీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం గంటస్తంభం: పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత విద్యనందించే పథకం క్రింద ప్రైవేటు పాఠశాలకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించి కొత్తవి భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం విజయనగరంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఉచిత విద్యకు సంబంధించిన కలెక్టర్ చేసిన ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. ఉచిత విద్యకు చెల్లించాల్సిన నిధులు ఇవ్వకపోతే తల్లిదండ్రులు ఏ పాఠశాలలో జాయిన్ చేయాలో తెలియక అయోమయం పడుతున్నారని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రైవేటు స్కూళ్లు ఉచిత విద్యను అందించే స్థితిలో లేవని, ప్రభుత్వం తల్లిదండ్రుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయాలని కోరారు. ఆ డబ్బుతో వారు ఇష్టమైన స్కూళ్లలో పిల్లలను చేర్పించుకుంటారని పేర్కొన్నారు.

తల్లికి వందనం అంగన్‌వాడీలకు వర్తింపజేయాలి



ఆర్ఐకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పూసపాటిరేగ : అంగన్‌వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలతో కలిసి బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అంగన్‌వాడీ వర్కర్ల పిల్లలకు దూరం చేయడం అన్యాయం అన్నారు. గ్రామాలలో నెల ఆదాయం రూ.10 వేలు, పట్టణాలలో రూ.12 వేలు ఆదాయం కంటె తక్కువ వున్న కుటుంబాలకు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం ఆదాయ పరిమితిని రూ.25 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. కేవలం సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతం వస్తుందనే కారణం చూపి సంక్షేమ పథకాలులో కోత విధిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, కుమారి, లత, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా..!

- సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని మంత్రి శ్రీనివాస్
- అదే బాటలో తహసీల్దార్ రత్నకుమార్ కూడా
- నేడు జరిగే సమావేశానికైనా హాజరవుతారా, లేదోనని సర్వత్రా చర్చ



ఎంపీడీఓ కార్యాలయం

గజపతినగరం రూరల్: గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి చేపట్టాలన్నా.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలన్నా ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాల్సిందే.. అయితే వీరిలో ప్రధానంగా మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంది. సమావేశంలో ప్రస్తావనకు వచ్చే సమస్యలకు పరిష్కార మార్గం చూపడంతో పాటు అందుకు అవసమైన నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుంది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ 12 నాటికి ఏడాది కాలం పూర్తయిన విషయం అందరికి తెలిసిందే. ఈ ఏడాది కాలంలో ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగు సార్లు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశాలకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఒక్కసారి కూడా హాజరుకాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరైతే మండలంలో ఉండే సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడమో లేక అభివృద్ధి పనులపై చర్చించడమో జరుగుతుందని సభ్యులు అభిప్రాయపడుతున్నారు. గడిచిన ఏడాది కాలంగా మంత్రి ఒక్క సమావేశానికి కూడా హాజరుకాకపోవడంతో సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. మంత్రి తీరుపై ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఏడాది కాలంలో సమావేశాలు ఇలా..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 21.08.2024, 17.11.024, 28.12.2024 (బడ్జెట్ సమావేశం), 23.03.2025న మండలి సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు మంత్రి హాజరుకాలేదు. 19.06.25న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. కనీసం ఈ సారైనా మంత్రి హాజరవుతారా, లేదా అని అందరూ ఎదురుచూస్తున్నారు.

మంత్రి బాటలోనే తహసీల్దార్ కూడా..

మండల సర్వసభ్య సమావేశాలకు మంత్రి శ్రీనివాస్‌తో పాటు స్థానిక తహసీల్దార్ రత్నకుమార్ కూడా హాజరు కాకపోవడంపై సభ్యులు మండిపడుతున్నారు. మంత్రి శ్రీనివాస్ బాటలోనే తహసీల్దార్ రత్నకుమార్ పయనిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఒక్క సమావేశానికి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. తర్వాత ఏ ఒక్క సమావేశానికి కూడా రాలేదు. ఈ నెల 19న జరగబోయే సర్వసభ్య సమావేశానికి వీరిరువురూ హాజరవుతారని సభ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అదే కారణమా..?

మండలంలోని 26 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉండగా.. ఆరు పంచాయతీల్లో టీడీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. అలాగే 16 మంది ఎంపీటీసీ సభ్యులు కూడా వైఎస్సార్‌సీపీకి చెందినవారే కావడం విశేషం. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గడిచిన ఆరు మాసాలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు, అలాగే మండల పరిషత్ అభివృద్ధి నిధులతో పాటు మరే నిధులు మంజూరు చేయలేదు. ఈ పరిస్థితుల్లో మండల సర్వసభ్య సమావేశాలకు మంత్రి హాజరైతే సభ్యులు ఎక్కడ నిలదీస్తారోనని భయంతోనే మంత్రి రావడం లేదన్న చర్చ సాగుతోంది. అలాగే మండలంలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి.. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.. ప్రభుత్వ భూములను ఇనాం భూములుగా పేర్కొంటూ పట్టాలిస్తున్నారు.. ఈ సమస్యలపై ఎక్కడ ప్రశ్నిస్తారోనని భయపడే తహసీల్దార్ కూడా సమావేశాలకు రావడం లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నేడు జరగబోయే సమావేశానికైనా వీరు హాజరవుతారో, లేదో వేచి చూడాలి.